

కారణజన్ముడి పాటను ఆవిష్కరిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర. చిత్రంలో జూలూరి గౌరీశంకర్, జూలూరి శివసాగర్, ఎం రజనీకాంత్, సాయి ప్రవల్లిక

# కేసీఆర్ కృషితోనే పల్లెలకు పునర్జీవం

## 'కారణ జన్ముడి' పాటను ఆవిష్కరించిన ఎంపీ వద్దిరాజు


హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పల్లెలు తిరిగి పునర్జీవం పొందడానికి కారకుడు, స్వరాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. తెలంగాణను దేశానికి ధాన్యాగారంగా మార్చి.. పల్లెలు పచ్చగా పరిఢవిల్లటానికి కేసీఆర్ కారకుడన్నది.. దేశమే గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 'కారణజన్ముడి' పాటను ఆదివారం సాయంత్రం వద్దిరాజు తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌కు బాగా తెలుసునని ఆయన చెప్పారు. తెలంగాణ సమాజాన్ని అన్నిరంగాల్లో సమున్నతంగా నిలిపేందుకు దశాబ్దకాలం కృషిచేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని స్పష్టంచేశారు. అందుకే ఆయన కారణజన్ముడని కొనియాడారు. ఈ పాటను చిత్రీకరించిన 'ఫస్ట్‌రీల్' సంస్థను వద్దిరాజు అభినందించారు. ఫస్ట్ రీల్-2025 కారణజన్ముడి పాటతో ప్రారంభం కావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, ఫస్ట్ రీల్ సంస్థ ఎండీ జూలూరి శివసాగర్, పాట రచయిత ఎం రజినీకాంత్, టీ సాయి ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ పాడిపంటలతో వర్ధిల్లాలి

తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో పాటు అష్టైశ్వర్యాలతో తులతూగాలని, ప్రజలు సుఖసంతోషాలతో ముందుకు సాగాలని శ్రీవారిని వేడుకున్నట్టు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఉగాది పర్వదినాన ఆదివారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆయురారోగ్యాలతో, ప్రజాజీవితంలో నిండు నూరేండ్లు ఉండాలని ఆ దేవున్ని కోరుకున్నానని తెలిపారు. పూజల్లో ఎంపీ వద్దిరాజు సతీమణి విజయలక్ష్మి, కుమార్తె డాక్టర్ గంగుల గంగా భవాని, కుమారుడు నిఖిల్ చంద్ర పాల్గొన్నారు.

### ముస్లింలకు వద్దిరాజు రంజాన్ శుభాకాంక్షలు

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో అన్ని మతాలకు సమప్రాధాన్యం ఇచ్చి.. గౌరవించారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సమాజానికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు నెలరోజులు నియమ, నిష్టతో ఉపవాస దీక్షలు చేస్తారని అన్నారు. క్రమశిక్షణ, ప్రేమ, దయ, కరుణ, శాంతి, సహనం, సౌభ్రాతృత్వాన్ని ఇస్లాం బోధిస్తుందని తెలిపారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పంచాంగ శ్రవణం వింటున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తదితరులు

# రాష్ట్రంలో పాలన కుంటుపడుతది

▸ మొదటిపేజీ తరువాయి...

శ్రీనివాస్‌రెడ్డి, వాణీదేవి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, సత్యవతి రాథోడ్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్, కవిత, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం రాజేశ్వర సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ది కర్కాటక రాశి అని, ఈ రాశివారికి ఆదాయం 8, వ్యయం 2, రాజ్యపూజ్యం 7, అవమానం 3గా ఉన్నదని తెలిపారు. ఈ ఏడాది కేసీఆర్‌కు అన్ని శుభఫలితాలు కలుగుతాయని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని, మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. వర్షాలు విరివిగా కురుస్తాయని, పంటలు సమృద్ధిగా పండుతాయని, అయితే అతివృష్టి కారణంగా నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రైతులు రుతువుల ఆధారంగా పంటలు వేసుకోవాలని సూచించారు. పప్పు దినుసులు విరివిగా పండుతాయని చెప్పారు. స్వార్థపూరిత ఆలోచనలు పెరిగిపోయి ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య విబేధాలు తారాస్థాయికి చేరుతాయని తెలిపారు. రాష్ట్ర పాలనాధిపతి అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది కన్యారాశి అని, ఇన్నాళ్లు మంచిస్థితిలో ఉన్న బృహస్పతి మే 14 తర్వాత స్థానచలనం చెందుతారని, తద్వారా రేవంత్‌రెడ్డికి పదవీ గండం పొంచి ఉందని చెప్పారు. సీటును కాపాడుకొనేందుకు ఆయన జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. వార్డు మెంబర్ నుంచి ఎమ్మెల్యే వరకు ఏ ఎన్నిక వచ్చినా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని చెప్పారు. బీఆర్ఎస్‌ది ధనస్సు రాశి అయినందున పార్టీతోపాటు ముఖ్య నాయకులపై మీడియాలో దుష్ప్రచారం పెరిగిపోతుందని, నాయకులు మీడియాతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమైన నాయకులకు విశేష ఆదరణ లభిస్తుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు దెబ్బతింటాయని, కేంద్రం నుంచి వచ్చే నిధులు ప్రజలకు చేరే అవకాశం లేదని పేర్కొన్నారు. ఈ సంవత్సరం చివరి నాటికి పోలీసుల అధికారాలు అపరిమితంగా పెరుగుతాయని, వారు పాలకుల చెప్పుచేతల్లో నడుస్తారని తెలిపారు. చిన్నపరిశ్రమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, ముఖ్యంగా వస్త్రపరిశ్రమ ప్రగతి పథంలో ముందుకెళ్తుందని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఒడిదొడుకులు తప్పవని, భూములపై పెట్టుబడి పెట్టేవారు జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే నష్టపోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

### ఉగాది అంటే షడ్రుచుల వేడుక

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

*హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): 'ఉగాది అంటే షడ్రుచుల వేడుక.. కష్టసుఖాల కలయిక.. పంచాంగ శ్రవణాలు.. తరాలు మారినా తరగని సాంప్రదాయలు..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను సమానంగా స్వీకరించాలనే తాత్వికతను బోధించే గొప్ప పండుగ అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కొత్త ఆశలు, కోటి ఆకాంక్షలతో మొదలైన విశ్వవసు నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు సకల విజయాలు సిద్ధించాలని కేటీఆర్ అభిలషించారు.*

### రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి

- పంటలకు సమృద్ధిగా నీరు లభించాలి
- ప్రజలకు మాజీ మంత్రి హరీశ్‌రావు ఉగాది శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మాజీ మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో విజయాలు సిద్ధించి, సకాలంలో వర్షాలు కురిసి, సాగునీరు పుష్కలంగా లభించి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలని మనసారా కోరుకున్నానని తెలిపారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన పార్టీ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

### కేటీఆర్‌తో మహేశ్ బిగాల భేటీ

- వివిధ దేశాల్లో పార్టీ రజతోత్సవ వేడుకల నిర్వహణపై చర్చలు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు ఎన్నారైల తరుపున ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వివిధ దేశాల్లో పార్టీ రజతోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. ఏప్రిల్ 27న నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావోత్సవాలకు వివిధ దేశాల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. వివిధ దేశాల్లో నిర్వహించనున్న వేడుకలకు బీఆర్ఎస్ ముఖ్యనాయకులు హాజరవుతారని వివరించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తానని పేర్కొన్నారు.



### బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నుంచి బీఆర్ఎస్‌లోకి

వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలానికి చెందిన బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ నాయకుడు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో చేరిన వీరికి మాజీ మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

*- నవాబుపేట*

### భవనం కూలిన ఘటనలో యజమాని రిమాండ్

భద్రాచలం, మార్చి 30: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో ఆరు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో భవన యజమాని శ్రీపతి శ్రీనివాస్‌ను పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. అనుమతులు లేకుండా ఆరు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తుండగా ఈ నెల 26న కుప్పకూలి ఇద్దరు మేస్త్రీలు మృతిచెందిన విషయం విదితమే. 27న తెల్లవారుజామున కామేశ్వరరావు అనే మేస్త్రీని కొన ఊపిరితో బయటకు తీయగా.. చికిత్స పొందుతూ గంట వ్యవధిలోనే మృతిచెందాడు. 28న ఉపేందర్ అనే మరో మేస్త్రీ మృతదేహాన్ని సహాయక సిబ్బందికి వెలికి తీశారు. అనుమతులు లేకుండా ఏకంగా ఆరు అంతస్తుల భవన నిర్మాణం చేపట్టడం, ఇద్దరి మృతికి కారణమైన యజమాని శ్రీపతి శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన భద్రాచలం పోలీసులు.. అతడిని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

# ధర్మ సంస్థాపనే బ్రాహ్మణుల కర్తవ్యం

## సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవంలో పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి ఉద్బోధ

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): ధర్మ సంస్థాపన బ్రాహ్మణుల కర్తవ్యమని, బ్రాహ్మణజాతి సముద్ధరణకు సమాజం సహకరించాలని పుష్పగిరి పీఠాధిపతి పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ విద్యాశంకర భారతీ స్వామివారు ఉద్బోధించారు. బ్రాహ్మణుల పట్ల కొందరిలో నెలకొన్న ద్వేషభావాన్ని తొలగించడంతోపాటు వారి ధర్మాచరణకు, సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలను పెంపొందించేందుకు అన్ని వర్గాల వారు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు, చార్టర్డ్ అకౌంటెంట్లు, టీచర్లు, మేనేజ్‌మెంట్ నిపుణులు ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సలెన్స్ సంస్థను ఆదివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. బేగంపేటలోని పుష్పగిరి జగద్గురు సంస్థానంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ విద్యా భారతీ స్వామీజీ ప్రసంగిస్తూ.. బ్రాహ్మణుల ఐక్యతకు, బ్రాహ్మణ యువత భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఈ సంస్థ ఎంతో కీలక భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పలువురు రాజకీయ నేతలు, బ్రాహ్మణ ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు ఈ కార్యక్రమానికి హాజరై సంస్థ పురోభివృద్ధి కోసం తగిన సూచనలు ఇచ్చారు. సంస్థ ఉద్దేశాలను అధ్యక్షుడు ఒద్దిరాజు విజయ్, ప్రధాన కార్యదర్శి వనం జ్వాలా నరసింహారావు వివరించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్, ఏపీ మాజీ డీజీపీ కరణం అరవిందరావు, మాజీ ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ ప్రభాకరరావు, 'హన్స్ ఇండియా' ఎడిటర్ రాము శర్మ, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' సీనియర్ ఎడిటర్ కొరిడె మహేశ్, ఆర్థికవేత్త ఎస్‌వీ రావు, పారిశ్రామికవేత్త చెరువు రాంబాబు, ఖమ్మం అడ్వకేట్ హరిబాబు, సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సలెన్స్ సంస్థ సంయుక్త కార్యదర్శి మరుమాముల వెంకటరమణ శర్మ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పూండ్ల కల్పవల్లి తదితరులు పాల్గొన్నారు.



బేగంపేటలో సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సలెన్స్ సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి భారతీస్వామి, తదితరులు



ఢిల్లీ పోరుగర్జన సభ ఆహ్వాన పత్రికను మధుసూదనాచారికి అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

### బీసీల పోరుగర్జనకు తరలిరావాలి

**బీఆర్ఎస్ శాసనమండలి పక్షనేత మధుసూదనాచారికి జాజుల ఆహ్వానం**

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): బీసీల బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించి.. రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరుతూ 2న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన బీసీల పోరుగర్జన సభకు అఖిలపక్ష నేతలు తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు అఖిలపక్షం నేతలను ఆదివారం ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారిని కలిసి బీసీల పోరుగర్జనకు హాజరు కావాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

### పండుగపూట బీఆర్ఎస్ నేత అరెస్ట్



*సిరిసిల్ల రూరల్, మార్చి 30: వాట్సాప్‌లో అభ్యంతరకర పోస్టు పెట్టాడంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ దళిత నాయకుడు బొడ్డు శ్రీధర్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శ్రీధర్ ఫోన్ సీజ్ చేసినట్టు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.*

# సొరంగమార్గంలో మరో 4 షీర్ జోన్లు

- మొత్తం మార్గంలో 11 జోన్లు
- 6 జోన్లు దాటి టన్నెల్ పనులు
- 7వ జోన్‌లో పొంచిఉన్న ప్రమాదం
- సొరంగమార్గం నిర్మాణంపై సందిగ్ధం

హైదరాబాద్, మార్చి30 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) టన్నెల నిర్మాణ మార్గంలో మరో 4 షీర్ జోన్లు ఉన్నట్టుగా అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఆ నాలుగు షీర్ జోన్లు అత్యంత ప్రమాదరకరంగా ఉన్నట్టు తేల్చి చెప్తున్నారు. ఇవి పనులకు అత్యంత ఇబ్బందికరంగా మారుతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతో మిగతా సొరంగమార్గం నిర్మాణంపై సందిగ్ధం నెలకొన్నది. సొరంగం తవ్వాల్సిన మార్గంలో మొత్తంగా 11 షీర్ జోన్లు ఉండగా, ఇప్పటికే 6 జోన్లను దాటి పనులు చేపట్టారు. ప్రస్తుతం ప్రమాదం సంభవించిన జోన్ మినహాయిస్తే మరో 4 జోన్లు ఉన్నాయన్నమాట. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 43.93 కిలోమీటర్లు సొరంగ మార్గం ద్వారా కృష్ణా జలాలను దిండి నది వద్ద నిర్మించే రిజర్వాయర్‌లో (నక్కలగండి తండా) కలుపుతారు. ఈ సొరంగం తవ్వకం పనులను వ్యతిరేక దిశలో ఇరు వైపుల నుంచి ప్రారంభించారు. శ్రీశైలం రిజర్వాయర్ గట్టు నుంచి అచ్చంపేట మండలం దోమలపెంట నుంచి ఇన్‌లెట్, మహబూబ్‌నగర్ జిల్లా మన్యంవారి పల్లె నుంచి అవుట్‌లెట్ టన్నెల్ పనులను ప్రారంభించారు. అందులో ఇన్‌లెట్ చివర నుంచి 13.937 కి.మీ, అవుట్‌లెట్ నుంచి 20.435 కి.మీ. కలిపి ఇప్పటివరకు మొత్తంగా 34.372 కి.మీ. సొరంగమార్గం పనులు పూర్తయ్యాయి. ఇంకా 9.560 కి.మీ. మేర సొరంగం తవ్వాల్సి ఉన్నది. అయితే ప్రస్తుతం ఇన్‌లెట్ వైపు 13.93 కి.మీ. వద్ద సొరంగం కూలి ప్రమాదం జరిగి 8 మంది కార్మికులు ప్రాణాలను కోల్పోయారు. ఇప్పటికే ఇద్దరి మృతదేహాలను వెలికి తీయగా, ఇంకా ఆరుగురు కార్మికుల అచూకీ లభించలేదు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

### షీర్ జోన్లు ఉంటే జరిగేది ఇదే

షీర్ జోన్ అంటే పగులువారి రాతిపొరలు ఉండే ప్రాంతం. ఆ పగుళ్లలో మట్టి, నీరు చేరడంతోపాటు రాతిపొరలు భౌతిక ఒత్తిళ్లకు గురవడం, రాళ్ల భాగాలు ఒకదానికొకటి వ్యత్యాసంగా తేలికగా జారిపోవడం, కదలికలకు గురవడం, పూర్తిగా వదులుగా మారిపోయి ఉంటాయి. ఫలితంగా భూప్రకంపనలకు గురవుతుంటుందని నిపుణులు వివరించారు. సొరంగ నిర్మాణాల వైఫల్యాలకు ప్రధానంగా ఇలాంటి జోన్లే కారణంగా నిలుస్తాయని భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. అలాంటి జోన్లలో సొరంగ నిర్మాణాలను చేపట్టే సమయంలోనే అనేక రకాలుగా అధ్యయనాలు చేయాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. టన్నెల్‌లో అలాంటి షీర్ జోన్‌లోనే ఇటీవల ప్రమాదం సంభవించి, 8 మంది గల్లంతయ్యారు.

### తొలినాళ్లలోనే 11 షీర్ జోన్ల గుర్తింపు

2005లో ఎస్ఎల్‌బీసీ అలైన్‌మెంట్ సమయంలోనే సొరంగ నిర్మాణ మార్గంలో మొత్తంగా 11 షీర్ జోన్లను గుర్తించినట్టు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటి వరకు ఇన్‌లెట్, ఔట్‌లెట్ మొత్తంగా కలిపి 6 షీర్ జోన్లను దాటుకుని సొరంగ నిర్మాణం కొనసాగించిచారు. ప్రస్తుతం ప్రమాదం సంభవించిన ప్రాంతంలో షీర్ జోన్ 8-15 మీటర్ల వరకు విస్తరించి ఉండగా, రాబోయే జోన్లు 20-50 మీటర్ల వరకు విస్తరించి ఉన్నట్టుగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కూలిన సొరంగం ప్రాంతంలో శిథిలాలను తొలగించి తవ్వకం పనులను పునరుద్ధరించినా అది కూడా కత్తిమీది సాములాంటిదేనని అధికారవర్గాలు వివరిస్తున్నాయి.

### లోతైన అధ్యయనాలు అవసరం

షీర్ జోన్ అనేది భూప్రకంపనాలకు అత్యంత ప్రభావితమైన ప్రాంతమని, ఇలాంటి చోట్ల భూభౌతిక అధ్యయనాల ఆధారంగానే నిర్మాణాలను చేపట్టాల్సి ఉంటుందని భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ప్రధానంగా భూమిలోని రాళ్ల దృఢత్వాన్ని అంచనా వేసేందుకు సెస్మిక్ టోమోగ్రఫీ, భూపొరల్లోని మార్పులను అర్థం చేసుకునేందుకు గ్రావిటీ సర్వే, భూ ఉష్ణోగ్రతలతో వాటిల్లే మార్పులను గుర్తించేందుకు మ్యాగ్నెటిక్ సర్వే, భూమిలోపలి నీటి నిక్షేపాలను, ప్రవాహరీతులు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు రీసిస్టివిటీ టెస్టింగ్, భూపొరల్లో ఒత్తిడిని గుర్తించేందుకు స్ట్రెయిన్ గేజ్ తదితర పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుందని చెప్తున్నారు. భౌగోళిక నమూనాకు సంబంధించి కచ్చితత్వం కోసం బోర్‌హోల్స్ ద్వారా సర్వేలు నిర్వహించి రాతి రకం, వాతావరణ తీవ్రత తదితర అంశాలను, పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు. మెటీరియల్ సైన్స్, రాక్ మెకానిక్స్, జియాలజికల్ తదితర విభాగాల సమ్మేళంతో అధ్యయనం చేయాల్సి ఉంటుందని చెప్తున్నారు. ఆయా అధ్యయనాల అనంతరమే నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. అనేక ముందస్తు రక్షణ జాగ్రత్తలను పాటిస్తూ పనులను చేపట్టాల్సి ఉంటుందని తేల్చి చెప్తున్నారు.

### భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

గుండాల, మార్చి 30 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని మామకన్ను ఆశ్రమ పాఠశాలలో అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వంటమనిషి శనివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి మృతిచెందాడు. మండల పరిధిలోని కాచనపల్లికి చెందిన పూనెం సతీష్(35)ను గుండాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే సతీష్ మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.